క్లుప్తంగా

శ్రీనివాసుని దర్శనం.. సౌభాగ్యదాయకం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశుడు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని ప్రతి శనివారం ప్రత్యేకంగా అలంకరించడం సాధారణమే అయినప్పటికీ ఈ శనివారం మాత్రం తొలిసారిగా పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. స్వామివారి అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. పట్టణానికి చెందిన దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, కిరాణా హోల్‌సేల్ వ్యాపారి రేపాక సత్యనారాయణమూర్తి, నాగ పెద్దింట్లమ్మ దంపతులు దాతలుగా స్వామికి విశేష పుష్పాలంకరణ చేయించారు.

బ్రహ్మాజీ మృతికి సంతాపం

అమలాపురం టౌన్: జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడు, అల్లవరం మండలం ఎంట్రికోనకు చెందిన ఇసుకపట్ల బ్రహ్మాజీ ఆకస్మిక మృతి పట్ల జిల్లా సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి తదితరులు సంతాపం తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొనుకు వెంకటేశ్వరరావు, సంఘ ప్రతినిధులు గున్నేపల్లి భీమశంకరం, జల్లి రాఘవ, పితాని బేబీరావు, జల్లి స్వామి, సంఘ సభ్యులు బ్రహ్మాజీ సేవలను కొనియాడారు. మృతుడి కుటుంబానికి సానుభూతి వ్యక్తపరిచారు.

సీహెచ్‌సీ కమిటీలో మహిళా సభ్యురాలిని నియమించాలి

తాళ్లరేవు: మండలకేంద్రం తాళ్లరేవు సామాజిక ఆస్పత్రి(సీహెచ్‌సీ) కమిటీలో మహిళా సభ్యురాలిని నియమించాలని తాళ్లరేవు మాజీ ఎంపీటీసీ సభ్యుడు టొంతు మోహన్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ తాళ్లరేవు ఆస్పత్రిలో మహిళా రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా అనస్తీషియా లేకపోవడంతో గర్భిణులను సైతం కాకినాడ రిఫర్ చేస్తున్నారన్నారు. పలు సేవలు అందక పేద మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీఓ ఎంఎస్ నెం.120 ప్రకారం ఆస్పత్రి కమిటీలో విధిగా మండల మహిళా సమాఖ్య ప్రెసిడెంట్‌గాని, కార్యదర్శి గాని ఉండాలన్నారు.

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు



మాట్లాడుతున్న కవి డాక్టర్ కొల్లూరి

అమలాపురం టౌన్: గ్రంథాలయాలు సరస్వతీ నిలయాల వంటివని విద్యార్థులు విజ్ఞానదాయక పుస్తకాలను చదవటం చిన్ననాటి నుంచి అలవాటుగా మార్చుకోవాలని కవి, రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మూడో రోజు శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రంథాలయాధికారి వర్మ అధ్యక్షత వహించారు. నేటి తరం విద్యార్థులకు పఠనాభిలాషను పెంపొందించే దిశగా వారిని గ్రంథాలయాల వైపు అడుగులు వేసేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మోటార్ సైకిల్ చోరీ

ముమ్మిడివరం: ముమ్మిడివరం బల్లగేటు సెంటర్లోని అన్నా క్యాంటీన్ వద్ద ఉంచిన మోటార్ సైకిల్ చోరీకి గురైంది. ముమ్మిడివరానికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు విళ్ల వీరాస్వామి నాయుడు శుక్రవారం రాత్రి అన్నా క్యాంటీన్ వద్ద మోటార్ సైకిల్ పెట్టి లోపలికి వెళ్లి వచ్చేసరికి కనిపించకుండా పోయింది. దీంతో వీరాస్వామి నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం ఎస్సై డి జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ముమ్మిడివరంలో మోటార్ సైకిళ్లు చోరీకి గురవు తున్నాయి. దీనిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుల బైండోవర్

అమలాపురం టౌన్: అమలాపురం మండలంలో అనధికారికంగా మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్సై పి.బాలాజీ బైండోవర్ చేశారు. నిందితులను అమలాపురం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహసిల్దార్ కిశోర్‌బాబు ఎదుట హాజరుపరిచారు. వారిరువురికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారని ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

- వర్షం కురిస్తే ప్రయాణం నరకం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు
- కన్నెత్తి చూడని నాయకులు



గోతులతో అధ్వానంగా మారిన చల్లపల్లి రహదారి



ప్రయాణికులకు అవరోధంగా మారిన సమనస- భీమనపల్లి రహదారి

ఉప్పలగుప్తం: కరోనా వంటి విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఓ పక్క సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరో పక్క అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగింది. గ్రామాల్లో రహదారులు, డ్రైన్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. విపత్కర పరిస్థితులు ఎదురైనా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిన వైఎస్ జగన్ ప్రభుత్వంపై అప్పటి ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారాలు చేశాయి. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లకు మహర్దశ కలిగిస్తామని ఎన్నికల ప్రచారాల్లో ఆయా పార్టీల నాయకులు ఊదరకొట్టారు. ఈ విషయాలను ప్రజలు నమ్మి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారు. ప్రభుత్వం కొలువుదీరి 6 నెలలు కావస్తున్నా నేటికి గ్రామీణ ప్రాంతాల రోడ్లపై ఎటువంటి శ్రద్ధ చూపటం లేదని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు. అసలే ఈ మధ్యకాలంలో వర్షాలు అధికంగా కురవటంతో చిన్నపాటి వర్షాలకు సైతం రోడ్లు జలమయమవుతున్నాయి. దీంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదచారులకు రోడ్డుపై అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టతరంగా మారింది. గోతుల్లో పడి వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు వాపోతున్నారు.

జగనన్న పాలనలో నిధుల మంజూరు

వైఎస్సార్ సీపీ హయాంలో అమలాపురం రూరల్ మండలంలో భట్నవిల్లిలో రూ.1 కోటితో సీసీ రోడ్డు, సవరప్పాలెంలో రూ.1.40 కోట్లతో బీటీ రోడ్డు, కామనగరువు నుంచి విలసవిల్లి మీదుగా భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయిపాలెం వరకు రూ.1.98 కోట్లతో బీటీ రోడ్డు, ఈదరపల్లి నుంచి ముక్కామల వరకు రూ.7 కోట్లతో బీటీ రోడ్డు, బండారులంకలో రూ.2.83 కోట్లతో, వన్నెచింతలపూడి నుంచి గూడాల వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్లు, అమలాపురం నుంచి అంబాజీపేట వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు, నల్లవంతెన నుంచి ఈదరపల్లి బైపాస్ రోడ్డుకు సుమారు రూ.3.5 కోట్లతో సీసీ రోడ్డును నిర్మించారు.

ఉప్పలగుప్తం మండలంలో ఎస్.యానం నుంచి ఎన్.కొత్తపల్లి పంచాయతీ మీదుగా కాట్రేనికోన మండలం అడవిపేట వరకు రూ.2.6 కోట్లతో బీటీ రోడ్డు, ఎన్.కొత్తపల్లి నుంచి ఉప్పలగుప్తం వరకు రూ.2 కోట్లతోను, గొల్లవిల్లి నుంచి సన్నవిల్లి వరకు రూ.10 లక్షలతో బీటీ రోడ్లను నిర్మించారు. అల్లవరం మండలంలో పేరూరు వై జంక్షన్ నుంచి గోడిలంక వరకు, బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకు రూ.25 కోట్ల సీఎస్ఆర్ నిధులతో బీటీ రోడ్లు నిర్మించారు. గోడిలంక నుంచి బెండమూర్లంక వరకు రూ.12 కోట్ల సీఆర్ఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, గుడ్డివానిచింత నుంచి దేవగుప్తం మీదుగా సామంతకుర్రు వరకు రూ.19 కోట్ల సీఆర్ఎఫ్ నిధులతో సీసీ, బీటీ రోడ్డు నిర్మాణం, సామంతకుర్రు నుంచి గాంధీనగర్ వరకు రూ.3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. బోడసకుర్రు నుండి ఏటిగట్టు మీదుగా బెండమూర్లంకకు రూ.7 కోట్ల సీఎస్ఆర్ నిధులతో బీటీ రోడ్డు, కామరాజుపేట, పేరాయిచెరువు ప్రాంతాల్లో రూ.68 లక్షలతో, వానపల్లిపాలెం పంచాయతీ పరిధి బొంతువారిపాలెంలో సుమారు రూ.60 లక్షలతో గత ప్రభుత్వంలో మంజూరైన బీటీ రోడ్లకు నిర్మాణాలు చేపడుతున్నారు.

ఉప్పలగుప్తం మండలంలో..

ఉప్పలగుప్తం మండలం సమనస నుంచి సూదాపాలెం మీదుగా భట్లుపాలెం రహదారి, కామనగరువు నుంచి విలసవిల్లి మీదుగా భీమనపల్లి రహదారి, అనాతవరం సెంటర్ నుంచి మునిపల్లి వరకు విస్తరించి ఉన్న సరిపల్లి, మునిపల్లి ఆర్ అండ్‌బీ రహదారి, గొల్లవిల్లి నుంచి సన్నవిల్లి మీదుగా విస్తరించి ఉన్న ఉప్పూడి రహదారి, ఉప్పలగుప్తం సెంటర్ నుంచి పేరాయిచెరువు మీదుగా కూనవరం వరకు విస్తరించి ఉన్న రహదారి, అమలాపురం ఎర్రవంతెన నుంచి ఎస్.యానం వరకు విస్తరించిన రహదారి, కిత్తనచెరువు నుంచి భీమనపల్లి వరకు విస్తరించి ఉన్న రహదారులు అధ్వానంగా మారాయి.

అమలాపురం మండలంలో..

అమలాపురం మండలం ఈదరపల్లి నుంచి ఇందుపల్లి, తాండవరం మీదుగా గున్నేపల్లి అగ్రహారం రోడ్డు, రోళ్లపాలెం నుంచి ఇమిడివరప్పాడు, ఎర్రవంతెన నుంచి సమనస రోడ్డు, నల్లవంతెన నుంచి వేమవరం, నల్లిమిల్లి సచివాలయం నుంచి అప్పారివారిపాలెం మీదుగా నడిపూడి రోడ్లు గోతులు పడి దారుణంగా మారాయి. అల్లవరం మండలంలో సామంతకుర్రు నుంచి కొమ్మరి గిరిపట్నం రోడ్డు, బెండమూర్లంక నుంచి కొమ్మరి గిరిపట్నం రోడ్డు, డి.రావులపాలెం నుంచి సరిపల్లి ప్రధాన రహదారి, కోడూరుపాడు నుంచి తాడికోన రోడ్లు స్థానికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకుని పాడైన రహదారులకు మోక్షం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్లను ఆధునీకరించాలి



మాది సన్నవిల్లి గ్రామం. సరిపల్లి –మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారి నుంచి మా గ్రామం మీదుగా ఉప్పూడి వరకు రోడ్డు విస్తరించి ఉంది. మా గ్రామానికి ఆటో, బస్సు సౌకర్యాలు ఉండవు. గర్భిణీ స్త్రీలు, వృద్ధులను ఆసుపత్రికి మోటారు సైకిల్‌పై తీసుకుని వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురిస్తే ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి రహదారిని ఆధునీకరించాలి.

– గుంట్రు చిట్టిబాబు, సన్నవిల్లి, ఉప్పలగుప్తం మండలం.

వాలీబాల్ క్రీడాకారుడికి అభినందన



ప్రసాద్‌ను సత్కరిస్తున్న సీఐ మోహన్‌కుమార్

ఐ.పోలవరం: స్థానిక ఎదుర్లంక రామాలయంపేట గ్రామానికి చెందిన నీరుపూడి ప్రసాద్ అండర్–19 విభాగంలో జాతీయ స్థాయి వాలీబాల్‌కు ఎంపిక కావడం పట్ల నియోజకవర్గ మాల మహానాడు హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం ముమ్మిడివరం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో నాలుగు మండలాల ముఖ్య నాయకుల సమక్షంలో ప్రసాద్‌ను సత్కరించారు. ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ కార్యక్రమానికి హాజరై ప్రసాద్‌ను అభినందించారు. మాజీ సైనిక ఉద్యోగి దుక్కిపాటి సత్యనారాయణ, దళిత ఉద్యమ నాయకులు బడుగు జేమ్స్ పాల్, కాశి, హనుమంతరావు, జగపతి, జనిపెల్లి సోమన్న, వడ్డి శ్యామ్‌ప్రసాద్, వజ్రపు శరత్, మొండి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంజరం వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు

తాళ్లరేవు: మండల పరిధిలోని యానాం–ద్రాక్షారామ రహదారిలో గల ఇంజరం వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల ఆర్అండ్‌బీ నిధులు మంజూరైనట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. శనివారం ఆయన తాళ్లరేవులో విలేకర్లతో మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా వంతెన శిథిలస్థితికి చేరుకోవడంతో ప్రయాణికులు, రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వంతెన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు ప్రారంభం



లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

యానాం: ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకొని పుదుచ్చేరి మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార విద్యార్థులు, యువతీ, యువకులకు శనివారం నుంచి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో భాగంగా పరుగుపందెం, లెమన్ అండ్ స్పూన్ పోటీలను నిర్వహించారు. పాఠశాలల్లో మత్స్యకార విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనెల 18న స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు 21న నిర్వహించే మత్స్యకార దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీ గొంతియ్య, పీఈటీలు పాము సత్యనారాయణ, చింతా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాలలు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

అమలాపురం టౌన్: నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులై నవ సమాజాన్ని నిర్మించాలని డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీమ్‌బాషా అన్నారు. స్థానిక వాగ్దేవి స్కూలులో శనివారం జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమానికి డీఈవో బాషా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్కూలు డైరెక్టర్ పరసా భరత్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు అమలాపురం ఉప విద్యాశాఖాధికారి (డీవైఈవో) గుబ్బల సూర్య ప్రకాశం మరో అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం చిన్నారి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను డీఈవో బాషా, డీవైఈవో సూర్య ప్రకాశం ఆద్యంతం వీక్షించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రిష్టి శ్రీరామచంద్రమూర్తి, ప్రధానోపాధ్యాయుడు పిచ్చిక సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అభయారణ్యం సందర్శన



కోరింగ అభయారణ్యాన్ని సందర్శించిన లా కళాశాల విద్యార్థులు

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక ప్రదేశం కోరింగ అభయారణ్యాన్ని శనివారం తూరంగి పీఎస్ రాజు లా కళాశాల విద్యార్థులు సందర్శించారు. అభయారణ్యంలోని ప్రముఖ ప్రదేశాలన్నింటినీ ఆసక్తిగా తిలకించారు. చెక్కల వంతెనలపై నడుస్తూ, బోటు షికారు చేసి ఆనందం వ్యక్తం చేశారు. అభయారణ్యంలోని విశేషాలను ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్ వారికి వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.సిద్ధార్థ, బీట్ ఆఫీసర్లు కె.మహేష్, సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, కళాశాల ప్రతినిధులు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



హోమగుండంలో ద్రవ్యాలు వేస్తున్న సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారం బాలవిద్యార్థి గణపతి ఆలయం వద్ద లక్ష్మీగణపతి హోమం శనివారం వైభవంగా జరిగింది. బాల విద్యార్థి గణపతి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ హోమాన్ని పంచాంగ కర్త, పురోహిత బ్రహ్మ ఉపద్రష్ట నాగాదిత్య సోదరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమం పూర్ణాహుతి సమయంలో భక్తులు హోమగుండంలో ద్రవ్యాలు వేసేందుకు ఎగబడ్డారు. అనంతరం ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని గణపతి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వార్డు కౌన్సిలర్ గోపిరాజీ రమేష్, నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బాల విద్యార్థి గణపతి సంఘం ప్రతినిధులు యల్లమిల్లి నాగసుధా కొండ, డాక్టర్ జయంతి సురేష్, మంగళంపల్లి ప్రదీప్ తోపాటు దుడ్డివారి అగ్రహారం యువకులు భక్తులకు సేవలు అందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలి

అమలాపురం టౌన్: అమలాపురంలో జరిగిన అండర్–13 జిల్లా చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన స్థానిక సర్ సీవీ రామన్ స్కూలు విద్యార్థి సాయి అద్విత్ మహేష్‌కుమార్‌ను ఆ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మహేష్ కుమార్ ఈనెల 19న తాడేపల్లిగూడెంలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లోనూ రాణించి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

వాహనం ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



పటవల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన క్షతగాత్రులు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని పటవల హైస్కూల్ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు యానాం నుంచి కాకినాడ వైపు వెళుతున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బలుసుతిప్ప గ్రామానికి చెందిన మల్లాడి పెదసత్తిరాజు, చంద్రరావులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. స్థానికులు హుటాహుటిన 108కు సమాచారం ఇచ్చి క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పచ్చపీతల హేచరీ స్థల పరిశీలన



చిర్రయానంలో పచ్చ పీతల హేచరీ స్థలాన్ని పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్

కాట్రేనికోన: తక్కువ ధరలకు పిల్లల దాణా లభిస్తే చేపలకు మేతగా వాడవచ్చునని మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ అన్నారు. శనివారం చిర్రయానంలో జిల్లా మత్స్యశాఖ జేడీ ఎన్ శ్రీనివాస్ అధ్యక్షతన పీతల చెరువు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. చిర్రయానంలో పచ్చ పీతల(గ్రీన్ క్రాబ్) హేచరీకి అవసరమైన స్థలాన్ని మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్, జిల్లా మత్స్యశాఖ జేడీ ఎన్ శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి ప్రసాదరావు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చిర్రయానంలో నిర్మించబోవు పీతల హేచరీ రాష్ట్రంలోనే మొదటిదన్నారు. పీతల హేచరీ నిర్మాణానికి ఎస్ఎఫ్‌డీబీ నిధులు రూ.2.75 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మూడు నుంచి ఆరు నెలలలోపు హేచరీ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. దీనిలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయనతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

కాంపొనెంట్ ప్లాన్‌కు ప్రత్యేక విభాగం ఉండాలి

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లో షెడ్యూల్డు కులాల వారికి అమలు చేసే ప్రత్యేక కాంపొనెంట్ ప్లాన్(ఎస్‌సిపి) సక్రమంగా అమలు చేయడానికి వీలుగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని శనివారం మాజీ ఎంపీ ఎం రామదాసు ఓ ప్రకటనలో కోరారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.488 కోట్ల నిధులను సక్రమంగా అమలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన ఎస్‌సీపీ సమావేశంలో సీఎం రంగసామికి తాను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

శ్రీహరి సాకేత ఆలయానికి భక్తుల తాకిడి



మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

ముమ్మిడివరం: కార్తికమాసం పర్వదినాలు, శనివారం వేంకటేశ్వరస్వామికి ప్రియమైన రోజు కావడంతో ముమ్మిడివరంలోని శ్రీహరి సాకేత ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పొన్నాడను ఆలయ మర్యాదలతో సత్కరించారు. సుమారు 25 వేలమంది దర్శనం చేసుకున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. అయ్యప్ప మాలధారులతో పాటు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

26 నుంచి జేఈ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

యానాం: పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్(పీడబ్ల్యూడీ) శాఖలో జూనియర్ ఇంజినీరు పోస్టులకు నిర్వహించిన పోటీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 26 నుంచి 29 వరకు ధృవపత్రాలను పరిశీలిస్తారని శనివారం పుదుచ్చేరి పీడబ్ల్యూడీ సెంట్రల్ ఆఫీసు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఓ ప్రకటనలో తెలిపారు. జేఈలతో పాటు పర్యవేక్షకుల పోస్టులకు ఎంపికైన వారికి సైతం ధృవపత్రాలను పరిశీలిస్తారన్నారు. ధృవపత్రాల పరిశీలన పుదుచ్చేరి పీడబ్ల్యూడీ సెంట్రల్ ఆఫీసులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో ఉంటుందన్నారు.

చేపల అక్రమ వేటపై ఫిర్యాదు

అల్లవరం: స్థానిక నదీ సంగమం వద్ద చేప పిల్లలను వేటాడుకుంటున్న తమపై కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం గ్రామస్తులు దాడి చేశారని ఒడిశా వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఒడిశాకు చెందిన ఎనిమిది మంది తాత్కాలిక షెడ్లు వేసుకుని సముద్రతీరంలో చేప పిల్లలను వేటా సముద్ర తీరంలో తాత్కాలిక షెడ్లు వేసుకుని వారి రాష్ట్రానికి తరలిస్తున్నారు. దీనిపై స్థానికులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వారి షెడ్లను ధ్వంసం చేసి, చేపలు పట్టుకోవడానికి ఏర్పాటుచేసుకున్న గొయ్యిని చెదరగొట్టి, వారు పట్టుకున్న చేపలను సముద్రంలోకి వదిలేశారు. దీనిపై ఒడిశా వాసులు ఫిర్యాదు చేశారు. అలాగే స్థానిక మత్స్యకారులు సైతం అనుమతులు లేకుండా చేపపిల్లను వేటాడుతున్న వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై హరీష్‌కుమార్ విచారణ చేపట్టారు.

కన్నుల పండువగా దీపోత్సవం



కేశవస్వామి ఆలయంలో దీపోత్సవం

తాళ్లరేవు: పవిత్ర కార్తికమాసం సందర్భంగా తాళ్లరేవు కేశవపురంలోని కేశవస్వామి ఆలయంలో దీపోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి శ్రావణకుమార్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తిక దీపాలతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నీలపల్లి గ్రామంలోని శ్రీ మీనాక్షీ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు, అన్నపూర్ణ దంపతులు పూజలు నిర్వహించారు.

23, 24 తేదీల్లో ఫైర్‌మెన్ డ్రైవర్ అభ్యర్థులకు పరీక్ష

యానాం: పుదుచ్చేరి అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్ డ్రైవర్ గ్రేడ్–3 పోస్టుల భర్తీలో భాగంగా ఇప్పటికే ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ) ఉత్తీర్ణత సాధించిన వారికి పోటీ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పుదుచ్చేరి డివిజనల్ ఫైర్ ఆఫీసర్ కె ఇళంగో ఓ ప్రకటనలో తెలిపారు. పీఎస్‌టీ ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 23 నుంచి డిసెంబర్12 వరకు శని, ఆదివారాల్లో పోటీ పరీక్షను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పుదుచ్చేరి, మత్తుయపాలెం, ట్రక్ టెర్మినల్ వద్ద పరీక్షలు ఉంటాయన్నారు. యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి అభ్యర్థులు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు.

డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మురుగునీటి గుంతను పరిశీలిస్తున్న భరతలక్ష్మి

అమలాపురం రూరల్: డెంగీ జ్వరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ భరతలక్ష్మి సూచించారు. శనివారం వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి వన్నెచింతలపూడి, సమనస గ్రామాల్లో ఆమె పర్యటించారు. వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజారోగ్యంపై ఎప్పటికప్పుడు ఆరా తీయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని ఆమె స్పష్టం చేశారు. వైద్యురాలు విష్ణుప్రియ, ఉద్యోగులు రామకృష్ణమూర్తి, శుభరత్నం, రాఘవేంద్ర, దుర్గాభవాని, నాగమణి పాల్గొన్నారు.